క్లుప్తంగా

పౌష్టికాహార కిట్ల పంపిణీకి దాతలు ముందుకు రావాలి



టీబీ రోగులకు పోషకాహారం అందిస్తున్న రాష్ట్ర టీబీ నివారణ అధికారి డాక్టర్ రమేష్

దేవరపల్లి: క్షయ రోగులకు పోషకాహార కిట్లు అందించేందుకు దాతలు ముందుకు రావాలని రాష్ట్ర టీబీ నివారణ అధికారి డాక్టర్ రమేష్ కోరారు. మండలంలోని గౌరీపట్నం పీహెచ్‌సీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. గ్రామంలోని టీబీ రోగుల గృహాలకు డాక్టర్ రమేష్ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. నిక్షయ మిత్ర ద్వారా వ్యాధిగ్రస్తులకు ఆయన పోషకాహార కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ టీబీ రోగులకు చికిత్స పూర్తయ్యే వరకూ నెలకు రూ.1,000 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాకు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ వసుంధర, పీహెచ్‌సీ వైద్యాధికారి జి.సతీష్, ఆర్.పోతురాజు, సీహెచ్‌సీ ఎ. చిన్నికృష్ణుడు, ఎంపీహెచ్‌ఎస్ వి.అశోక్ వర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు ఫర్నిచర్ బహూకరణ



ఎంఈఓల ద్వారా పాఠశాలకు ఫర్నిచర్ అందిస్తున్న దాత సుమలత

నల్లజర్ల: మండలంలోని పోతవరం కొత్తపేటలో ఇటీవల ఏర్పాటు చేసిన ఎంపీపీ పాఠశాలకు చిడిపి సుమలత అనే దాత రూ.30 వేల విలువైన ఫర్నిచర్ సమకూర్చారు. తన ఇంటి పక్కనే ఏర్పాటు చేసిన ఈ పాఠశాలకు బీరువా, టేబుల్, టీచర్స్‌కు 4 చైర్స్ ఆమె అందించారు. సుమలత బుధవారం వాటిని ఎంఈఓలు వై.సత్యనారాయణ, భగవతి ఆధ్వర్యంలో ఆ పాఠశాలకు అప్పగించారు. కాగా దాత సుమలత ఏలూరు సబ్‌జైలు వార్డెన్‌గా పని చేస్తున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోపి గోవర్ధన్, సీఆర్పీ శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

కళాశాలకు కుర్చీలు..

నిడదవోలు: సంకల్ప్–2025 కార్యక్రమంలో భాగంగా స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యార్థినులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం రోటరీ క్లబ్, రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్‌ల ఆధ్వర్యంలో బుధవారం కళాశాలకు ఆరు ఫైబర్ కుర్చీలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో బచ్చు సుమన్, ప్రిన్సిపాల్ బి. గీతాంజలి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

ఉపాధ్యాయులకు డీఈఓ వాసుదేవరావు సూచన



కరగపాడు ఎంపీ యూపీ స్కూల్లో ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈవో వాసుదేవరావు

గోపాలపురం: విద్యలో వెనుబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు సూచించారు. మండలంలోని కరగపాడు, కొవ్వూరుపాడు పాఠశాలలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో రాజీ పడవద్దని ఉపాధ్యాయులకు సూచించారు. గత సంవత్సరం కంటే ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు.ఆయన వెంట ఎంఈఓ ఎ. మహేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

చోరీ కేసులో నిందితునికి రెండేళ్ల జైలు

కొవ్వూరు: పట్టణంలో జరిగిన రెండు చోరీ కేసుల్లో నేరం రుజువు కావడంతో నంబారు గణేశ్ అనే నిందితునికి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ కొవ్వూరు సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి మంగళవారం తీర్పు చెప్పారు. కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం గోళ్లపాలేనికి చెందిన నంబారు గణేశ్ అదే మండలంలోని రామవరానికి చెందిన లొల్లా గణేశ్ అనే వ్యక్తికి చెందిన వీవో ఫోన్‌ను గతేడాది ఫిబ్రవరి 18న కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో చోరీ చేశారు. అదే రోజు రాజమహేంద్రవరానికి చెందిన చిట్టే విజయబాబుకు చెందిన ఫోన్‌ను కూడా నంబారు గణేశ్ కాజేశాడు. ఈ రెండు సెల్‌ఫోన్ చోరీలపై అప్పటి కొవ్వూరు పట్టణ ఎస్సై డి.భూషణం కేసు నమోదు చేశారు. కోర్టులో నిందితుడు నంబారు గణేశ్ పై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నాగలక్ష్మి అతడికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధించినట్టు సీఐ తెలిపారు.

వ్యర్థాలు చేరి .. పూడికలు పెరిగి

- ఆపై అల్లుకుపోయిన తూడు, గుర్రపు డెక్క
- నీరు పారని పిల్ల కాలువలు
- శివారు ఆయకట్టుకు అందని నీరు
- ఆవేదన చెందుతున్న అన్నదాతలు



వ్యర్థాలతో కూడిన కాపవరం పిల్ల కాలువ



ముక్కామలలో చెత్తా చెదారంతో నిండిన పిల్ల కాలువ

పెరవలి: పాలకులు ప్రధాన కాలువల నిర్వహణపై చూపించే శ్రద్ధను పిల్ల కాలువలపై చూపడం లేదు. పర్యవసానంగా పిల్ల కాలువలు తమ అస్థిత్వాన్ని కోల్పోయే స్థితికి చేరుకున్నాయి. ప్రధాన కాలువల్లో సాగునీరు సక్రమంగా ప్రవహిస్తున్నా ఆయకట్టు భూములకు నీరందని పరిస్థితి నెలకొంది. పెరవలి మండలంలో నరసాపురం, కాకరపర్రు, బ్యాంక్ కాలువలు ప్రధానమైనవి. వాటి నుంచి విడిపోయి ప్రవహించే పిల్ల కాలువలు 69 ఉన్నాయి. నిర్వహణ కొరవడడంతో పిల్ల కాలువల్లో గుర్రపుడెక్క, తూడు పేరుకుపోయాయి. దానికితోడు కొన్నిచోట్ల ఆక్రమణల వల్ల, మరికొన్ని చోట్ల పూడుకుపోవడం వల్ల పిల్ల కాలువలు కుచించుకుపోయాయి. ఫలితంగా ఆయకట్టు శివారు భూములకు నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి

పెరవలి, ముక్కామల, ఖండవల్లి, ఉసులుమర్రు, కాపవరం, అన్నవరప్పాడు గ్రామాల మీదుగా గరప, వైర్, కాపవరం కాలువలు, ఖండవల్లి చానెల్, బ్రాంచ్ కెనాల్, పెండ్యాల పంపింగ్ స్కీమ్ కాలువలు ప్రవహిస్తున్నాయి. వాటి ద్వారా ఒక్క పెరవలి మండలంలోనే 39,000 ఎకరాలకు నీరు అందించాల్సి ఉంది. అయితే కేవలం 20,000 ఎకరాలకు మాత్రమే సక్రమంగా నీరు అందుతోంది. మిగిలిన 19 వేల ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో కొంత విస్తీర్ణానికి నీరు అందుతుండగా, రబీ సీజన్‌లో మొత్తం విస్తీర్ణానికి అందడం లేదని రైతులు చెబుతున్నారు. కాపవరం, ముక్కామల ఆయకట్టుకు పూర్తిగా నీరందని పరిస్థితి నెలకొంది. తాము బోర్లపై ఆధారపడి పంటలు సాగు చేసుకోవాల్సి వస్తోందని ఈ గ్రామాల రైతులు చెబుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కాలువలను తామే బాగు చేసుకుంటున్నామని పేర్కొంటున్నారు. అయినప్పటికీ ఖరీఫ్‌కు తప్ప రబీ పంటకు నీరు అందడం లేదని చెబుతున్నారు.

వ్యర్థాలతో పూడుకుపోయి..

కాలువల ద్వారా సాగునీరు అందకపోయినా పంట వేసిన పాపానికి ఏటా ప్రభుత్వానికి నీటితీరువా చెల్లించక తప్పడం లేదని కాపవరం, ముక్కామల గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువల దుస్థితి గురించి ఇరిగేషన్ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గ్రామాల మధ్య నుంచి కాలువలు ప్రవహించడంతో గృహవాసులు ఎక్కడికక్కడ చెత్తా చెదారం వేస్తున్నారు.ఆ వ్యర్థాలతో కాలువలు పూడుకుపోయి, పొలాలకు నీరందడం లేదని వివరిస్తున్నారు. కాపవరం వెళ్లే గరప కాలువ పెరవలి గ్రామం మధ్య నుంచి ప్రవహిస్తోంది. గృహవాసులే గాకుండా, హోటల్స్, చికెన్, చేపల దుకాణాల వారు నిత్యం వేస్తున్న వ్యర్థాలతో కాలువలు పూడుకుపోయి సాగునీటిని సరఫరా చేయలేని దుస్థితికి చేరుకుంటున్నాయి.

అడిగినా సమాధానం చెప్పరు



కాలువలను రైతులే స్వచ్ఛందంగా బాగు చేసుకుంటున్నాం. పిల్ల కాలువల నిర్వహణను అధికారులు పట్టించుకోరు. ఎన్నిసార్లు అడిగినా సమాధానం చెప్పరు. ఈ కాలువల ద్వారా రబీకి నీరు రావడం ఎంతో కష్టంగా ఉంది.

–కుసుమే సూరిబాబు , రైతు, ఖండవల్లి

అధ్వానంగా కాలువలు



పిల్ల కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది. కాలువల్లో వ్యర్థాలతో పాటు, చెత్తాచెదారం, గుర్రపు డెక్క పేరుకుపోవడంతో ఆయకట్టుకు నీరు అందడం లేదు. వాటి దుస్థితి గురించి అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా ప్రయోజనం లేకపోయింది. బోర్లపై సాగు చేసుకుంటున్నాం.

–కోటిపల్లి రాంబాబు, రైతు, అన్నవరప్పాడు

నిధుల మంజూరు



మండలంలోని పేకేరు, గరప కాలువల తవ్వకాలకు నిధులు మంజూరయ్యాయి. ఉన్నతాధికారులు ప్రస్తుతం టెండర్లు పిలిచే దశలో ఉన్నారు. టెండర్ ఖరారు అయిన వెంటనే కాలువల తవ్వకాలు చేపడతాం.

– ఎన్.బాలమురళీకృష్ణ, ఇరిగేషన్ ఏఈ, పెరవలి

కానూరు పంచాయతీకి ఫ్రీజర్, వ్యాన్ బహూకరణ



కానూరు పంచాయతీకి ఫ్రీజర్, ఆటోను బహూకరిస్తున్న రాము

పెరవలి: మృతదేహాలు భద్రపరిచే ఫ్రీజర్‌ను, వాటిని శ్మశానవాటికకు తరలించే ఆటోను ఓ స్వచ్ఛంద సంస్థ మండలంలోని కానూరు పంచాయతీకి సమకూర్చింది. అమ్మ బ్లడ్ అనే స్వచ్ఛంద సంస్థ రూ.2.25 లక్షల విలువైన ఈ రెండు పరికరాలను విరాళంగా ఇచ్చింది. ఆ సంస్థ వ్యవస్థాపకుడైన టి.రాము బుధవారం ఫ్రీజర్‌ను, ఆటోను గ్రామపెద్దల సమక్షంలో కానూరు పంచాయతీ సర్పంచ్ భావన్ మధుకు అప్పగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మధు మాట్లాడుతూ కానూరుతో పాటు నడుపల్లి, ఉసులుమర్రు, కానూరు అగ్రహారం, పెండ్యాల, గ్రామాలకు ఈ ఫ్రీజర్, వాహనం ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అమ్మ బ్లడ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడైన రాము ఇప్పటి వరకూ 1031 అనాథ శవాలకు దహన సంస్కారాలు చేయడం గొప్ప విషయమన్నారు. తన గ్రూపు సభ్యుల ద్వారా ఆపదలో ఉన్న 2500 మందికి బ్లడ్ అందించారని అభినందించారు. కార్యక్రమంలో అనపర్తి నరసింమూర్తి, అనపర్తి సత్తిపండు, బూరుగుపల్లి రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు తోట సురేష్, వెన్నపు సుధాకర్, పెదప్రోలు వెంకట్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

అసర్ సర్వే విజయవంతం చేద్దాం

- దూబచర్ల డైట్ ప్రిన్సిపాల్ కమలకుమారి
- 60 మంది వలంటీర్లకు శిక్షణ
- 13, 14 తేదీల్లో గ్రామాల్లో సర్వే



అసర్ సర్వే వలంటీర్లకు సూచనలు ఇస్తున్న డైట్ ప్రిన్సిపాల్ కమలకుమారి

నల్లజర్ల: మూడు నుంచి 16 ఏళ్ల మధ్య వయసు పిల్లల వాస్తవ విద్యా స్థితిగతులు తెలుసుకునేందుకు ప్రథమ్ సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న అసర్ సర్వే విజయవంతం చేయాలని ఛాత్రోపాధ్యాయుల (డైట్ విద్యార్థులు)కు డైట్ ప్రిన్సిపాల్ ఎం.కమలకుమారి సూచించారు. 2024 సంవత్సరానికి అసర్ సర్వే నిమిత్తం వలంటీర్ల (డైట్ విద్యార్థులు) శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం దూబచర్లలోని డైట్ కళాశాలలో ప్రిన్సిపాల్ కమలకుమారి ప్రారంభించారు. అసర్ జిల్లా కో–ఆర్డినేటర్, సీనియర్ పాత్రికేయుడు డి.సోమసుందర్ ఈ సర్వేకు సంబంధించిన పలు విషయాలను విద్యార్థులకు వివరించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 30 గ్రామాల్లో ఈ సర్వే జరుగుతుందన్నారు. ఇందుకోసం 60 మంది డైట్ ఛాత్రోపాధ్యాయులకు వలంటీర్లుగా శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఈశిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లుగా జి.సురేష్‌బాబు, డి.రాజీవ్ వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. డైట్ లెక్చరర్స్ పీవీ రమణ మూర్తి, సీహెచ్ లక్ష్మీనారాయణ, ఈ కార్యక్రమం ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తారన్నారు. బుధ, గురువారాల్లో నిర్వహించే శిక్షణ కార్యక్రమం అనంతరం శుక్ర ,శనివారాలలో సంబంధిత గ్రామాల్లో సర్వే జరుగుతుందని ప్రిన్సిపాల్ కమలకుమారి వివరించారు.

హాకీలో సత్తా చాటిన చివటం కుర్రాడు



తల్లిదండ్రులతో నాగసాయి కేశవ్

ఉండ్రాజవరం: అండర్– 14 సబ్ జూనియర్స్ జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ హాకీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు కాంస్య పతకం సాధించింది. ఈ పోటీలు ఇటీవలే కోయంబత్తూరులో జరిగాయి. కాగా కాంస్య పతకం సాధించిన ఆంధ్రప్రదేశ్ జట్టుకు గోల్‌కీపర్ మండలంలోని చివటం గ్రామానికి చెందిన మునుపర్తి నాగసాయి కేశవ్.12 ఏళ్ల కేశవ్ తణుకులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. రెండేళ్లుగా రోలర్ స్కేటింగ్ హాకీ సాధన ప్రారంభించినట్టు అతడు బుధవారం ఇక్కడ విలేకరులకు కేశవ్ తెలిపాడు. పాఠశాలలో కోచ్, ట్రైనర్ భార్గవ్ వద్ద శిక్షణ పొందుతూ మూడు నెలల్లోనే జిల్లా స్థాయి ట్రయల్స్‌లో పాల్గొన్నారు. అనంతరం జాతీయ స్థాయి పోటీల్లో మెడల్ సాధించాడు. కేశవ్ తల్లిదండ్రులు రమేష్, దేవి. ఉద్యోగ నిమిత్తం బుట్టాయగూడెం నుంచి వచ్చి మండలంలోని చివటం గ్రామంలోని జగనన్న కాలనీలో వారు నివాసం ఉంటున్నారు. మంగళగిరిలో 2027లో నిర్వహించే ఏషియన్ చాంపియన్ షిప్ రోలర్ హాకీ పోటీలో మెడల్ సాధించడమే తన లక్ష్యమని మునుపర్తి నాగసాయి కేశవ్ విలేకరులకు చెప్పారు.

వివాహమైన 10 నెలలకే మృతి



నేతల దేవి మృతదేహం

కొవ్వూరు: వివాహమై పది నెలలు గడవకుండానే పట్టణంలోని శ్రీరామా కాలనీకి చెందిన నేతల దేవి (21) అనే యువతి అనుమానాస్పదంగా మృతి చెందింది. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు అందిన సమాచారం మేరకు తాను ఘటనా స్థలాన్ని వెళ్లినట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. అంతకు ముందు దేవి తన భర్త వీరబాబుకు ఫోన్ చేసి చికెన్ తీసుకురమ్మని చెప్పింది. దేవి చెప్పినట్టుగా చికెన్ తీసుకుని భర్త ఇంటికి వచ్చేసరికి ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. తన భార్యకు అరోగ్యపరమైన సమస్యలు ఉన్నాయని, గత నెలలో సుమారు 20 రోజుల పాటు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స తీసుకుందని వీరబాబు చెప్పినట్టు సీఐ తెలిపారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదూ రాలేదని పట్టణ పోలీసులు చెప్పారు. మృతురాలు కాకినాడ జిల్లా అన్నవరం సమీప గ్రామానికి చెందిన వారు. మృతురాలి బంధువులు అంతా కొవ్వూరు చేరుకున్నారు. కేసు లేకుండా రాజీ చేసుకునేందుకు ఉదయం నుంచి చర్చలు నడుస్తున్నాయి.

చిట్టడవి కాదు.. కళాశాల ప్రాంగణమే



కళాశాల ఆవరణలో పెరిగిపోయిన పిచ్చి మొక్కల మధ్య గాంధీ విగ్రహం

నిడదవోలు: పట్టణ శివార్లలోని ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో అపరిశుభ్ర పరిస్థితులు నెలకొన్నాయి. కళాశాల ముందుభాగంలో సుమారు ఎకరం, వెనుక భాగంలో మరో ఎకరం ఖాళీ స్థలం ఉంది. పట్టించుకునే వారెవరూ లేకపోవడంతో కళాశాల ముందు భాగం అంతా పెద్దపెద్ద గోతులు, తుప్పలతో నిండిపోయింది. వర్షపు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి ఈ ప్రాంతమంతా చెరువును, ఏపుగా పెరిగిన తుప్పలతో చిట్టడవిని తలపిస్తోంది. కళాశాల భవనం పక్కనే పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో అప్పుడప్పుడూ తరగతి గదుల్లోకి విష పురుగులు ప్రవేశిస్తున్నాయి. దాంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ఈ కళాశాలలో సుమారు 150 మంది విద్యార్థులు వివిధ కోర్సులు అభ్యశిస్తున్నారు. కళాశాల ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద తుప్పలు బాగా పెరిగిపోయాయి. దాంతో ఈ విగ్రహం వద్దకు వెళ్లి మహాత్మునికి పూలమాల వేయడానికి భయపడే పరిస్థితి ఏర్పడింది. అలాగే ఇక్కడి అంబేడ్కర్ విగ్రహం వద్ద కూడా పిచ్చి మొక్కలు పెరగడంతో కొందరు అధ్యాపకులు వాటిని తొలగించారు. కళాశాల వెనుక భాగంలో ఆట స్థలం ఉంది. ఆటలకు వీలుగా కోర్టులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. క్రీడా ప్రాంగణాన్ని చదును చేసి కోర్టులు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. కళాశాలలో సరైన వసతులు లేకపోవడంతో ఏటేటా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఇప్పటికైనా కళాశాల అభివృద్ధిపై ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి దృష్టి సారించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. కళాశాల ఆవరణలో పెరిగిన తుప్పలు, పిచ్చిమొక్కలను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నేటి నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

దేవరపల్లి: రైతుల భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి బుధవారం తెలిపారు. ఈ నెల 12 నుంచి 28 వరకూ రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆయా గ్రామ సచివాలయాల వద్ద ఈ సదస్సులు జరుగుతాయన్నారు. ఈ నెల 12న బంధపురం, 13న చిన్నాయగూడెం, 16న దేవరపల్లి, 17న యాదవోలు, 18న యర్నగూడెం, 19న దుద్దుకూరు, 20న లక్ష్మీపురం, 21న పల్లంట్ల, 23న ధుమంతునిగూడెం, 24న గౌరీపట్నం, 26న కొండగూడెం, 27న త్యాజంపూడి, 28న కురుకూరు గ్రామాల్లో సదస్సులు జరుగుతాయని ఆమె వివరించారు.

గోపాలపురం: మండలంలో గురువారం నుంచి గ్రామాల వారీగా నిర్వహించే రెవెన్యూ గ్రామ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.అజయ్‌బాబు సూచించారు. ఈనెల 12న ప్రారంభమయ్యే ఈ సదస్సులు జనవరి 7 వరకూ మండలంలోని 19 రెవెన్యూ గ్రామాల్లోనూ నిర్వహిస్తామన్నారు.

తాళ్లపూడి: మండలంలో ఈ నెల 12 నుంచి 30 వరకూ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ బి.రవీంద్రనాథ్ బుధవారం చెప్పారు. 12న తాళ్లపూడి, కుకునూరు, 13న అన్నదేవరపేట, 16న వేగేశ్వరపురం , 17న పెద్దేవం, 18న బల్లిపాడు, 20న మలకపల్లి, 21న గజ్జరం, 24న రాగోలపల్లి, పోచవరం, తుపాకులగూడెం, 26న రావూరుపాడు, 27న తాడిపూడి, 28న ప్రక్కిలంక, పైడిమెట్ట, 30న తిరుగుడుమెట్ట గ్రామాల సచివాలయాల వద్ద ఈ సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించే ఈ సదస్సులలో రీ సర్వేలో అంశాలు తప్ప మిగిలిన రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదులు అందజేయాలన్నారు.

పెరవలి మండలంలో..

పెరవలి: మండలంలో గురువారం నుంచి రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ డి.అచ్యుత కుమారి తెలిపారు. ఈ నెల 12న కాకరపర్రు, 13న తీపర్రు, 17న పెరవలి, 18న ఖండవల్లి, 19న కొత్తపల్లి అగ్రహారం, 20న నడుపల్లి, 21న కానూరు, 24న కానూరు అగ్రహారం, 26న, ఉసులుమర్రు, 27న అజ్జరం, 28న కాపవరం, 31న పిట్టల వేమవరం, జనవరి 2న మల్లేశ్వరం, 3న ముక్కామల గ్రామాల్లో సభలు నిర్వహిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రి మృతి

చాగల్లు: చాగల్లు– ఊనగట్ల రహదారిపై పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఊనగట్లకు చెందిన బొర్రా బాలకృష్ణ (25) అనే తాపీమేస్త్రీ దుర్మరణం చెందాడు. ఆ గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చాగల్లు నుంచి బాలకృష్ణ బైక్‌పై స్వగ్రామం ఊనగట్ల వస్తున్నాడు. ఇంతలో వెనుక నుంచి వస్తున్న క్వారీ లారీ ఢీకొట్టి అతడి నడుమ భాగంపై నుంచి వెళ్లింది. దాంతో తీవ్రంగా గాయపడిన బాలకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం నుజ్జునుజ్జయ్యింది.

సాగునీటి సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్

పెరవలి: మండలంలోని మూడు సాగునీటి సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ జారీ చేశామని తహసీల్దార్ డి.అచ్యుత కుమారి తెలిపారు. మండలంలోని కానూరు, పెరవలి, ఖండవల్లి నీటిసంఘాల పరిధిలో 14,677 మంది ఓటర్లు ఉన్నారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాగల్లు: కలవలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ ఎస్.నారాయణ అప్పారావు బుధవారం తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిపి వేస్తామన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

నిడదవోలు: స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తారు. సీజీఆర్ఎఫ్, ఏపీఈపీడీసీఎల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సీజీఆర్ఎఫ్ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పొగాకు తోటలకు మానుకుళ్లు తెగులు

పరిశీలించిన సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు



వాదాలకుంటలో పొగాకు తోటను పరిశీలిస్తున్న సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు, బోర్డు సిబ్బంది,రైతులు

గోపాలపురం: వర్జీనియా పొగాకు తోటలకు మానుకుళ్లు, సీతాఫలం తెగుళ్లు సోకినట్టు సీటీఆర్ఐ శాస్త్రవేత్త డాక్టర్ హెచ్ఆర్ మహేష్ చెప్పారు. వాదాలకుంట గ్రామంలోని పొగాకు తోటలను బుధవారం ఆయన శాస్త్రవేత్తలతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో తోటలకు తెగుళ్లు సోకుతున్నాయన్నారు. ప్రతి రైతూ విధిగా పంట మార్పిడి చేపట్టడం ద్వారా తెగుళ్లను నియంత్రించవచ్చన్నారు. భూమిలో సారం తగ్గినపుడు కూడా తెగుళ్లు వస్తుంటాయన్నారు. తెగుళ్ల నివారణపై సీటీఆర్ఐలో పరిశోధనలు జరుపుతున్నామని చెప్పారు. ఎక్కువ శాతం తెగుళ్లు సోకిన తోటలను దుక్కి దున్ని, మరలా పొగాకు నాట్లు వేయాలని ఆయన రైతులకు సూచించారు. ఆయన వెంట గోపాలపురం పొగాకు వేలం నిర్వహణాధికారి అమూల్ ఢీ స్యామ్, రైతు సంఘం అధ్యక్షుడు ఇల్లూరి రాంబాబు, ఉపాధ్యక్షుడు దుగ్గిరాల రాంబాబు, వాదాలకుంట పొగాకు రైతులు పాల్గొన్నారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీకి 28లోగా ఎంట్రీల ఆహ్వానం

గోపాలపురం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా రంగారావు, మధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వేళ్లచింతలగూడెం గ్రామంలో నిర్వహించే టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఈనెల 28 లోగా ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంట్రీ ఫీజును రూ.5 వేలుగా నిర్ణయించామన్నారు. టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ ప్రథమ బహుమతిగా రూ.1.50 లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.75 వేలు, తృతీయ బహుమతిగా రూ 30 వేల నగదును విజేతలకు అందజేస్తామన్నారు.

చాగల్లులో లక్ష పత్రి పూజ

చాగల్లు: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం లక్షపత్రి పూజ నిర్వహించారు. వేద పండితుడు లింగాల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పండితులు, పురోహితులు స్వామి, అమ్మవార్లకు మహాన్యాస పూర్వక పంచామృతాలతో ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, సహస్ర కుంకుమార్చన, జ్యోతిర్లింగార్చన, సుబ్రహ్మణ్య హోమం, సూర్య నమస్కారాలు, నీరాజన మంత్ర పుష్పాల సమర్పణ వంటి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గురువారం ఆలయం ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహిస్తున్నామని తెలిపారు.

కెనరా బ్యాంక్ Canara Bank
గణపవరం బ్రాంచ్ (6083)
గణపవరం, ఆంధ్రప్రదేశ్-534198.
ఫోన్: 08818-256688, 8333813824

సెక్షన్ 13(4) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

[illegible]

తేది: 06-12-2024
ప్రదేశం: గణపవరం
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com